


[5–10–47 సంచిక నుండి

## ౬

"అలా కూచోడం కూచోడం, సుమారు నే నొక్క గంట కూచున్నాను. ఆ గంటా బాగా ఆలోచించాను. అంతసేపటికి హఠాత్తుగా నా తలలో యేదో మెరుపు మెరిసినట్టయింది. నిదానించగా, 'ఒకానొక చిన్నకటి సంగతి స్మృతి అది."

"చిటికే 'బోస్' యిదేనా ?" అంటావు నువ్వు; కాని మహా మంచి సంగతి అది. అదే నన్నీ స్థితికి తెచ్చింది. ఇంతేకాదు, నా జీవితాకాశాన, అది యెప్పుడూ ధ్రువతారలాగ మిలమిల్లాడుతూనే వుంటుంది."

"నిరుపేదల యింటో పుట్టి అష్టైశ్వర్యవంతులైన వాళ్ళ జీవితాలు, అపూర్వాలైన గొప్ప పనులుచేసినవారి మనుగడా, అజ్ఞానాంధకారంలో నుంచి విజ్ఞానప్రభల్లోకి వెళ్ళిపోయినవారి చరిత్రా పరిశీలిస్తే అలాంటి కీలలాకే కనపడతాయి; గాని వాటి శక్తి కార్యకారణాలకు అతీతం అయివుంటుంది. హేతువాద బద్ధమైన జనసామాన్యం, విప్పిచెప్పినా వాటి విశిష్టత గుర్తించుకోలేదు; కాని, సాధారణంగా, అవే గొప్పవారి జీవితక్రమం సరిదిద్దినవయి ఉంటాయి."

"సరిగా, నా తలలో మెరిసిన మెరుపు అలాంటిదే. తనకనే, భిక్షాటనంచేసిన బ్రాహ్మడికడుపున పుట్టిన నేను ఏడెనిమిది లక్షలకు అధికారినయి వుండడం."

"మహేంద్రవాడలో, మా యింటియెదుట వొక బీద కోమిటి వుండేవాడు. ఒక గదీ, వొక వసారా—ఇంతే అతని యిల్లు. అదయినా, తాటాకుల యిల్లు. ఆ గదిలోనే పగలు అంగడీ, రాత్రిళ్లు పడకాను. అంగడి అంటే యేమిటో అనుకోకు, ఉప్పూ, మిరపకాయా, చింతపండూ—ఇలాంటివిమాత్రమే. వాటికయినా, పెట్టుబడి పాతిక రూపాయీలే: కాని వడిదుడుకులేకుండా గడిచిపోయేది అతని సంసారం. పెట్టుబడి తరిగిపోకుండా అలాగే వుండడమే కాదు, నెలనెలకీ ఏమాత్రమో పెరిగేదికూడాను."

"చిల్లర 'శిరాలక్ష్మి' అన్నమాట యెప్పుడైనా విన్నావా? చిల్లరఅంగడిదగ్గిర కాస్సేపు కూచుని చూసినవాళ్ళకే అది అర్థం అవుతుంది. 'పాతిక రూపాయీలతో వర్తకం యేమి' టనిపిస్తుంది మన బ్రాహ్మలికి; కాని కోమటిబిడ్డ సంగతి కేసు. "ఇరవై రూపాయీల పెట్టుబడికంటే పాతిక రూపాయీల పెట్టుబడి యెక్కువ కాదా ?" అంటాడు కోమటిబిడ్డ. నిజానికి "పెట్టుబడి యేమాత్రం ?" అనికాదు కోమిటిబిడ్డ నడగవలసింది "చేంామణీ యేపాటి ?" అని."

"ఆ కోమిటికి, నా యీడువాడే—నాలాగే వొక్కడే కొడుకు. ఆ కొడుక్కీ నాకూ జత. వెడితే యిద్దరమూ వెళ్ళేవాళ్ళం ఎక్కడికైనా. లేకపోతే, మే మిద్దరమే ఆడుకునేవాళ్ళం. ఆటలంటే యేమిటేమిటో కాదు, కుండబంతి తప్ప మేము మరోటి యెరగం, ఆడగా, ఆడగా, దాని ముందు, మాకు చదువెందుకనిపించేది. దాని రుచి విడిచిపెట్టలేక, చివరికి, పదకొండేళ్ళ వయస్సున మే మిద్దరమూ బడి మానేశాం, కూడబలుక్కుని."

"తరవాత మేము చేసే పని—ఆడినంతసేపూ కుండబంతి ఆడడం. అది వీలు కాకపోతే వూరంతా తిరగడం. తరుచు, మేము, పొలాలుకూడా తిరిగేవాళ్లం. ఏ పొలం యెవరిదో మాకు బాగా తెలుసు. కరణానికి యే పొలం పరిమితి యెంతో, నంబరెంతో అది తెలుసు. కరణానికీ, మాకూ ఇంతే భేదం."

"అయితే, యెక్కడ తిరిగినా, తిరిగినంతసేపూ నేను దర్జాగా తిరిగేవాణ్ణి. అతనుమాత్రం, పొలాలలో తిరిగేటప్పుడు "తీస్తే యెవరూ యేమీ అనని వస్తువు ఏమయినా దొరుకుతుందా?" అంటూ పరకాయిస్తూనే తిరిగేవాడు. అందుకు తగ్గట్టు, ఏదో వొక వస్తువు చేతబుచ్చుకోకుండా అతి డెప్పుడూ ఇంటికివచ్చి యెరగడు. మచ్చిచెట్టు




[ప్రచురితమగుచున్న కొత్త సీరియల్]

యినా, యిప్పచెట్టయినా, మోదుగుచెప్ప అయినా కనబడితే పెన్నిధి దొరికినట్టు పొంగిపోయేవాడతను. ఆకులు కోసి అతనింటికి తీసుకువస్తే, అవి యెండబెట్టి వాళ్ళ అమ్మ విస్తరాకులు కట్టేది. అంగడిలో పెట్టి వాళ్ల నాన్న అవి అమ్మేవాడు. అతను చెట్టెక్కి ఆకులుకోసి కిందపడేస్తే, ఏరి బొత్తులు పెట్టి యిస్తూవుండే నేనే కొన్నాను, దానికి మూడు విస్తళ్ళొక వాడు."

"ఇంత స్వేచ్ఛగా తిరుగుతూ వుండినీ, వర్తకంలో, అతను తండ్రికి ఆసరాకూడా అవుతూ వుండేవాడు. ఉప్పూ, చింతపండూ—ఇలాంటివి తెమ్మని తండ్రి చీటీ యిస్తే, అతను రాయవరం వెళ్ళి తెచ్చి అంగడి నింపేవాడు. తండ్రి భోజనం చేసేటప్పుడు అంగడిలో కూచుని అమ్మకమున్నూ సాగించేవాడతను."

"ఇదంతా చూస్తూవుంటే నాకు గమ్మత్తుగా కనపడేది; కాని, ఆ దినాల్లో నేను పూతికముల్లంతయినా పని ముట్టుకుని యెరగను. ఇంటో వుండి సంతసేపూ కథలు చెప్పమని మా అమ్మని విసిగించేవాణ్ణి, వీధికి వెడితే దర్జాగా తిరిగేవాణ్ణి, నాతో సరిగా ఆట లాడుతూ కూడా ఆ కోమటిబిడ్డ మధ్యమధ్య సంసారంకోసం పాకులాడ్డం చూస్తే, మా అమ్మ చెప్పిన కథలున్నూ నెమరుకి వస్తే మనం యిలా బడుద్దాయిగా తిరగడం యేమిటి ?" అనిపిస్తూనూ వుండేది; కాని మానలేకపోయేవాణ్ణి. పని అయ్యేటప్పటికి ఆమడ దూరాన వుండిపోయేవాణ్ణి."

"మా మహేంద్రవాడ చూశావా యెన్నడయినా ? నూరిళ్ల వెలనాటి అగ్రహారం అది. మా వూరి బ్రాహ్మల్లో చాలామంది సంపన్నులు, చాలామంది లోటు లేనివాళ్లున్నూ. ఊరంతకీ మే మొక్కళ్లమే బీదవాళ్లం. అయితే, తంబురా పుచ్చుకుని తిరిగినా మా నాయన దూరన్న దుర్గా నా తెరగడు. అంచేత, మే మంటే బ్రాహ్మలందరూ చాలా గౌరవంగానే చూచేవారు. అయినా, వాళ్ల యెదట లిగాడుగా వుండడం యిష్టంలేక నేను బ్రాహ్మణకుర్రాళ్లకి దూరంగా వుండేవాణ్ణి. ఆ పూరంతకీ కోమటి సుబ్బయ్య వొక్కడే నాకు జత. పాపం, అతను కూడా నా వొక్కడితోనే వుండేవాడు. మొత్తానికి, మేము, పట్టిగడియలూ కలిసే వుండేవాళ్లం. కోమటిబిడ్డతో యిలాంటి సంతత సాహచర్యంవల్ల, ఇదమిత్థం అని యేర్పరించుకోలేకపోయినా, ఆ చిన్నతనంలో కూడా, లక్ష్మీకటాక్షానికి పాత్రం కావడానికి కోమటిజాతిలో యేదో విశిష్టత వుందని నాకు స్ఫురిస్తూనే వుండేది."

"ఫాల్గున పున్నమికి మా మహేంద్రవాడ గ్రామంలో అమ్మవారి తీర్థం. ఇవాళ వెళ్ళి అది చూస్తే నవ్వు వస్తుంది; కాని ఆ చిన్నతనంలో "బాబోయ్ ! ఎన్ని అంగళ్లో ?'' అనిపించేది. కొనేదీ, తినేదీ తక్కువ అయినా. ఆ అంగళ్ల మధ్య తిరగడం అంటే నా కెంతో సరదాగా వుండేది."

"ఆ సంవత్సరం, తీర్థానికి, మా అమ్మ రెండణాలిచ్చింది నాకు. రెండు దినాలు పోరుపెట్టగా—ఆఖరికి, ఏడవపోగా, సుబ్బయ్యకి ఒక్క అణా యిచ్చాడు వాళ్ళ నాన్న. "ఓస్, ఇంతేనా ?'' అన్నాను నేను. కులంలోనే కాక, డబ్బులో కూడా అతనికంటే గొప్పవాణ్ణని మహాగర్వపడ్డాను నేను. ఆ రెండణాలతోనూ నాలుగైదు రకాల పిండివంటలు కొనుక్కుని కమ్మగా తినవచ్చునని కూడా నేను ఊరిపోయాను కూడా; కాని నే నెంత యీసడించినా అతను ఆ అణా చూసుకునే సంతోషించాడు. నా కంటే తనకి తక్కువ డబ్బు అన్నందుకతను లేశమూ విచారించలేదు.''

"అప్పుడు ''మరి రా తీర్థంలోకి వెడదాం'' అంటూ నేను ముందడుగు వేశాను. అతను కదల్లేదు. "ఏమిటా తొందర ?'' అని కూడా విసుక్కున్నాడు. నిజానికి, అప్పటికింకా జాము న్నర పొద్దుంది. ఎండ, చాలా తీక్ష్ణంగానే వుంది. అయితే, ఆ రూండణాలూ యెప్పుడు ఖర్చుపెట్టే

స్తా నా అన్న ఈ బలాటంలో నాకా యెండ అంత అడ్డంకిగా కనపడలేదు. మనస్సు, ఉరకలూ పరుగులూ పెట్టేస్తూ వుండింది."

"ఒక్క క్షణం ఆగి నేను మళ్లీ తొందర పెట్టాను. చెయ్యి పట్టుకుని లాగాను కూడా. అయినా, అతను బయలుదేరలేదు. పైగా "అంగళ్లు రాండే వెళ్ళి యేమి చేస్తావయ్యా?" అని డేకారించాడు. మాట్లాడలేకపోయాను నేను. ఇంకా వొక్క గంటకిగాని తీర్థం పూనుకోదు, నిజమే; కాని చెప్పవద్దూ? అప్పుడు నాకు అంగళ్లవాళ్ల మీద చాలా కోపం వచ్చింది. ఆ కోమటిబిడ్డ వాళ్ల పక్షంగా మాట్లాడుతున్నట్టు కనపడి అతని మీద మండుకుపోయింది. వాళ్ళందరూ వొట్టి సోమరిపోతుల్లా కనపడ్డారు నాకు. అయినా వుండలేకపోయాను. "ఈ వూరికే వుండడం అక్కడే అయితే యేమీ?" అనిపించింది. నువ్వు రాకపోతే నేను వెళ్లలేననుకున్నావా? అనిన్నీ అందామనిపించింది. "అంతసేపు తంటాలుపడితే గాని చేతికి రాని అణాకాసు, దీపాలు పెట్టేదాకా చూసిచూసి యితను ఖర్చుపెట్టలేదు కాబోలురా దేవుడా?" అంటూ ఆశ్చర్యపడిపోయాను."

"దానా దీనా కావలసిన కాలహరణం అయిపోయింది. అప్పుడు "మరి రావయ్యా" అంటూ అరుగు దిగాడతను. ఒక్కదూకు దూకి నేనతని ముందుకి వెళ్లి నుంచున్నాను. నాకంటే తక్కువ డబ్బున్నవాడు నాకు ముందు నడవడమూ మరి? కాని అతను, అమ్మవారి గుడికేసి కాక రాములవారి గుడికేసి బయలుదేరాడు. "అలా యెక్కడికి?" అనడగాను నేను నిలిచిపోయి. "ఇక్కడికే" అన్నాడతను, అడుగు వేస్తూనే- "ఎందుకోయ్?" అనడుగుతూ రెండు ఉరుకు లురికి నేను అతని ముందు పడ్డాను ఇలాగ ప్రశ్నోత్తరాలు జరుగుతూనే వుండగా మలుపు తిరిగాం. వెంటనే తమలపాకుల రాగమ్మ యింట్లో దూరాడతను."

"అక్కడ, అతను, అరణా తమలపాకులు పుచ్చుకున్నాడు. "తాంబూలం వేసుకుంటూ తిరుగుతాడు కామోసు సుబ్బయ్య?" అనుకున్నాను నేను. ఇంతలో వెనక్కి వచ్చి మిగిలిన అరణా తల్లి చేతిలో వుంచి, దానికి, పోకచూరూ, లవంగాలూ, ఏలకాయలూ, కవిరీ పుచ్చుకున్నాడు. పెరట్లోకి వెళ్ళి సున్నం తెచ్చాడు. తాపీగా





నేతాజీ ఆమ్లా హేరాయిల్

సువాసనతోకూడిన వనమూలికలతో తయారుకాబడినది

★

తలవెంట్రుకలను పెంచును. కుదుళ్ళకు బలమునిచ్చి నల్లగ నిగనిగలాడు. నిడుపాటి వెంట్రుకల నిచ్చుటలో సాటిలేనిది. తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకుట మొదలగువానిని నివారించును. అన్నివేళలకు ఆనందమునిచ్చి శీతల పరిమళము కలిగియుండును. వాడిన ఎడల గుణమును గుర్తించగలరు.

సీసా 1 కి రూ. 1-8-0. పోస్టేజి ప్రత్యేకం.

శ్రీ కృష్ణా సోప్ వర్క్సు, శివాలయం వీధి, బెజవాడ.

కూచుని పన్నెండు కిల్లీలు కట్టాడు. నేను తెల్లపోయాను. ఆదిలో అతను తమలపాకులు కొంటున్నప్పుడే నాకు మాట రాకుండాపోయింది. కిల్లీలు పళ్లెంలో వుంచుకుని "మరి పదవయ్యా" అంటూ రిక్షా పట్టుకు లాగేటప్పటికి నాకు చైతన్యమే లేకుండా పోయింది.''

''కాళ్ళు సాగాయే గాని, అప్పుడయినా నాకు మాట రాలేదు. మనస్సులో మాత్రం వూహలమీద వూహలు పరుగెత్తాయి. "ఎంత యెత్తు యెత్తాడురా కోమటిబిడ్డ?" అంటూ ముందు నేనబ్బురపడిపోయాను; కాని వెంటనే ''వెర్రిపుల్లయ్య కాకపోతే వీడిదగ్గిర కిల్లీ లెవడు కొంటాడూ?" అనిపించింది. "ఉన్నది అంతా తగలేసుకున్నాడు కనక, ఏమయినా కొనుక్కోడానికి, వీడు, మన రెండణాలలోనూ అర్థమం అరణా అయినా బదులడుగుతాడు, తప్పదు" అని తోచింది నాకు. దాంతో నా గుండెలు కొట్టుకున్నాయి. కాళ్ళు వొణికాయి, శరీరం అంతా చీమలూ జెర్రిలూ పాకుతున్నట్టయింది. వల్లమాలిన కోపమున్నూ వచ్చేసింది. "బలవంతం చేస్తాడేమో?" అని భయంకూడా పుట్టుకువచ్చింది. "ఎందుకయినా మంచి"దని వెంటనే జేబులో వున్న బేడకాసు తీసి గుప్పిట్లో పెట్టుకున్నాను. ఓరచూపులు చూసుకుంటూ రెండడుగులు ఎడంగా కూడా జరిగాను. అలాంటప్పుడు అతనికి ఎదట వుండడం మరీ అపాయకరం అన్నిపించి, ఆ పక్కవాటున కూడా ఒక అడుగు అతనికి వెనకవెనకనే వుంటూ వచ్చాను.''

''అప్పటి కప్పుడే తీర్థం బాగా వూపుకుంది. సుబ్బయ్య తండ్రి గుటుకుగుటుకులుగా అప్పడాలు వేయించిపోసి గుక్కతిప్పుకోకుండా అమ్మేస్తున్నాడు. తెల్లని తలబనియన్ల మీద నల్లని వుల్లిపొర చొక్కాలు తొడుక్కుని పెద్దపెద్ద అప్పడాలు కరకర లాడిస్తూ రైతుబిడ్డలు విలాసవిహారాలు చేస్తున్నారు.

''వెళ్లి వెళ్ళడంతోటే "కిల్లీలు, కిల్లీ"లంటూ, సుబ్బయ్య, ఆ రైతుబిడ్డల మధ్యన పడ్డాడు. అది చూశాటప్పటికి పకోడీల అంగడికేసి మళ్ళిన నాకు అడుగు పడలేదు; కాని ఆ తరక్షణంలో, సుబ్బయ్య పళ్లెంలో, ఘల్లుఘల్లున పన్నెండు విడికానులు పడ్డాయి."

"నాకళ్లే నేను నమ్మలేకపోయాను. ఒక్కక్షణం నాకు ప్రపంచం తెలియలేదు. గుప్పిట్లో వుండిన బేడకాను గడిపరకగా తోచగా, అప్రయత్నంగా జేబులో పడేశాను- ఈ చేతినుంచి ఆ చేతికి, ఆ చేతినుంచి మళ్ళీ యీ చేతికి మారడంలో, నాలుగల్లా పన్నెండు కానులు అయిపోడం గారడీగా కనపడింది నాకు. ''ఇందులో వున్న కిటుకేమిటి?" అని ఆలోచన రేగింది; కాని నాకు తూర్పూ పడమరా యేమీ బోధపడలేదు. పదకొండేళ్ల వాణ్ణి నేనప్పటికి నా మాటకేం, యిరవైయేళ్ళవాడవు, నీకయినా బోధపడిందా అది?''

''మన బ్రాహ్మలకీ కావాలి డబ్బు, అయితే, మనవాళ్లకది వచ్చే మార్గం యీనాములు. కాకపోతే నౌకరీ, లేకపోతే సంభావనలు, అదయినా చేతకాకపోతే రాగిచెంబు యెర్రగా తోముకుని బయలుదేరడం. అందుకూ పనికిరాకపోతే, మీసాలు మెలిపెట్టుకుంటూ వాళ్ళనీ వీళ్ళనీ కోర్టుల వెంట తిప్పడం. ఇంతే కాదూ? కాని, ఆ పూటకి గతిలేకపోయినా, కోమటిబిడ్డ ముష్టికి బయలుదేరడం ను ఎక్కడయినా చూశావా? వందచుట్టలూ, డజను అగ్గిపెట్టెలూ పుచ్చుకు బయలుదేరినా, నిమిష నిమిషానికీ రకం మార్చుకుంటూ తిరిగాడంటే దర్జాగా దినం గడవిపోతుం దతనికి. ఆ రహస్యం గుర్తించగలవా నువ్వు? ఆ పురుషకారం బోధపరుచుకోగలవా నువ్వు?''

"ఏతావతా:—అది చూశాటప్పటికి, మొదట్లో నా కాశ్చర్యం కలిగినమాట వాస్తవమే; కాని అంతలో, నా బ్రాహ్మణీకం మళ్లీ పురెక్కింది. కష్టపడితేగాని అతనికి ఆ పెరిగిన డబ్బులు రాలేదనీ, నాకు దర్జాగా వచ్చాయనీ, మళ్లీ మరొక రకమైన గర్వరేఖ మెరిసింది నా తలలో. అంచేత, నా గొప్పతనం భంగపడలేదని నేను బాగా మురిసిపోయాను. దాంతో, పిండివంటలు కొనుక్కుని తినెయ్యాలన్న ఆత్రం మళ్లీ యెక్కువయిపోయింది. వెంటనే "యిక రా" అన్నాను; కాని సుబ్బయ్య రాలేదు. నాకేసే చూడలేదతను. ధర్మమే లే. నా వుబలాటమే గాని, లాభం మరిగిన కోమటిబిడ్డ బ్రాహ్మణకుర్రాడితో తిరుగుతాడూ చేతులు ముడుచుకునీ!"

"అటుచూసి యిటుచూసి "అంత తొందరగా వుంటే నువ్వు కొనుక్కో వెళ్ళి" అంటూ నన్ను తిరస్కరించి, మళ్లీ వూళ్లోకి తయ్యారడతను. కొయ్యయిపోయాను నేను. కాకపోతే, తరతరా

అలాగా — యుగయుగాలుగా సంచితమై వుండిన గొప్ప సంప్రదాయం అతనిది, అప్పుడు నే నేమి అర్థంచేసుకోగలను ? కాగా, కొంతసేపటికి, అతని కళ్లు చూడలేవా అనీ, అతని ముక్కు వాసన గ్రహించలేదా అనీ, అతని జిహ్వ రుచి కట్టలేదా అనీ, ఆ జన్మకి అనుభవించే యోగ్యత లేదా అనీ నాకు సందేహం కలిగింది. ఎటు చూసినా ఎన్నో కొన్ని డబ్బులు పట్టుకుని తీర్థంలోకి వచ్చిన ఆ యీడు కుర్రాడు, యేదో వొకటి కొనుక్కు తినకుండా వూళ్ళోకి వెళ్లడం నాకు కనపడలేదు మరి."

"ఏమిటి చెయ్యడం ? అతన్ని విడిచిపెట్టి అంగళ్ళలో ప్రవేశించడమా, బుర్ర వంచుకుని అతని వెనకనే తిరగడమా ? నా కిది గడ్డు సమస్య అయిపోయింది. అటు చూడగా, అతను, చరచరా ముందుకి వెళ్ళిపోతున్నాడు. ఇటు చూడగా, అప్పుడే తయారవుతున్న వేడివేడి పకోడీలు "బ్రహ్మశ్రీవి, వేదమూర్తివి, నీకు కోమటిబిడ్డతో సావాసం యేమిటి, యీపాటి కిలా దయచెయ్యవోయి శాస్త్రుల్లూ" అంటూ ముక్కు తాళ్ళు పోసి నన్ను లాగేస్తున్నాయి. నే నీ గుంజాటనలో వుండగా, అతనింకా దూరం వెళ్లిపోయాడు. అప్పటినాకా వొక్క క్షణం అయినా నన్ను విడిచి వుండలేని సుబ్బయ్య, వెనక్కి తిరిగి అయినా చూడకుండా రయిమని వెళ్లిపోతూ వుండడం నాకు మర్మాఘాతం అయిపోయింది."

"నా కిది గొప్ప పరాభవంగా తోచింది, నిజమే ; కాని "వెనక్కి వెళ్ళి వత నేమి చేస్తాడూ ?" అని నాకు జిజ్ఞాస పట్టుకుంది. కళ్ళు మూసుకుని తీక్ష్ణంగా ఆలోచించాను ; కాని గుర్తించుకోలేకపోయాను వెంటనే నాలుగడుగలు వేసి, ఆదురా అణుచుకోలేక నాలుగంగలున్నా వేసి, అతణ్ణి కలుసుకున్నాను."

"ఇద్దరమూ మాట్లాడకుండానే నడిచాం. అందరూ తీర్థంలోకి వస్తూ మా కెదురుపడేవారేగాని, మే మిద్దరమూ తప్ప, అప్పటి కింకా వూళ్ళో కెవళ్ళూ వెళ్ళడంలేదు. ఏమి టేమిటో అడుగుదామనుకుంటూనే అడుగు వేశాను ; కాని నా కొక్క మాటూ పైకి రాలేదు. ఇంతలో శివాలయం దాటాం. ఇంటికి వెళ్ళి అతను జరిగిందంతా తల్లికి చెబుతాడనుకున్నాను నేను. తండ్రి తీర్థంలో వున్నాడు కనక, అంగడిలో కూచుని యెప్పుడూ చింతపండూ — ఇలాంటివి అమ్మకం సాగిస్తాడు కాబోలు ననిన్నీ అనుకున్నాను. "అయితే, అప్పుడు వనం యేమిటీ చెయ్యడం ?" అని ఆలోచన పట్టుకుంది ; కాని, దారీ తెన్నూ తోచక నే నిలా సతమత మయిపోతూ వుండగా, యీ సందువాట్లో, అతను తన యిల్లు దాటేశాడు. మళ్లీ రాగమ్మ యింటికి వెడతాడు అని అప్పటికి తోచింది నాకు."

"సరిగా అంతే జరిగింది. అతను రాగమ్మ యింట్లోనే ప్రవేశించాడు. దాని దగ్గర మళ్ళీ తమలపాకులు కొన్నాడు. తల్లిదగ్గిర పోకచూరూ అవీ కూడా పుచ్చుకున్నాడు. ఈసారి ఆ సరుకు ఇరవై నాలుగు కిళ్లీలు కట్టాడు అవి పుచ్చుకుని, అతను, తీర్థంలో పావుగంట అయినా తిరిగాడో లేదో యెగిరిపోయాయి."

"మళ్లీ అటూయిటూ పారజూచి యేమిటో అంచనా వేసుకున్నాడు. మళ్ళీ కిళ్లీలు కట్టాడు. మళ్లీ అమ్మేశాడు. అయితే, రెండోమాటు అతను కిళ్లీలు కట్టాటప్పటికే నేను చిరుతిండి మాటే మరిచిపోయాను. మొగం వేలవేసుకుని, మాటామంతీ లేకుండా అతని కూడా తిరిగాను. మూడోమాటు అతను కిళ్లీలు కట్టాటప్పుడు "మనం కూడా యీపని చేద్దామా ?" అనిపించింది నాకు; కాని అభిజాత్యం పొడుచుకువచ్చింది. ఛీ, నువ్వు బ్రాహ్మణపుట్టుక పుట్టలేదూ ? అని లోపల్నించి నన్నెవరో గదుముతున్నట్టున్నూ అనిపించింది. దాంతో, దగ్గిరవుండిన బేడకాసు చూసుకుని సిగ్గుపడ్డాను ; గాని, కులం తలుచుకుని గర్వమే తెచ్చుకున్నాను."

"చివరికి, చెప్పవచ్చిం దేమిటంటే ? తల తిరిగిపోయీ, మనస్సు చెదిరిపోయీ, బుద్ధి మళ్లిపోయీ ఆ రెండు అణాలూమాత్రం నేను ఖర్చుపెట్టలేదు. పైగా, ఆ అంగళ్లవాళ్ళు నన్ను నిలువునా దోపిడి చెయ్యడానికి వచ్చిన పచ్చిపాళ్ళులా కనపడ్డారు. నిజానికి, చైతన్యం లేకే ఖర్చుపెట్టలేకపోయినా, డబ్బు చేతపుచ్చుకుని ఖర్చుపెట్టెయ్యడానికే బయలుదేరిన బ్రాహ్మణకుర్రాడికి, అన్ని పకోడీల అంగళ్ళ మధ్యనూ అలాంటి విముఖత కలగడంమాత్రం అప్పటికీ యిప్పటికీ కూడా మిక్కిలి ఆశ్చర్యకరంగానే వుంది నాకు."